# ఇసకతిన్నెలు

మేడమీద మా పడగ్గది. కిటికీలో కూచుంటే కనిపిస్తాయి – ఇసక తిన్నెలు. దూరంగా – పొద్దున్న నీళ్ళూ, ఇసక తిన్నెలూ విడివిడిగా కనిపిస్తాయి. ఇసక మధ్యని దోసపాదులూ, పుచ్చపాదులూ, వాటి మధ్య గుడిసెలూ, అన్నీ, సాయంత్రం ఎదురెండలో నీళ్ళూ, ఇసకా ఒకటే మెరుపులో కలిసిపోతాయి. ఆ ఆకుపచ్చవన్నీ దోసపాదులూ, పుచ్చపాదులూ అని అన్నయ్య చెప్పాడు. వాడెన్నోసార్లు వెళ్ళాడు తిన్నెలమీదకి – నేనొక్కసారీ వెళ్ళలా.

రోజూ సాయంత్రం అమ్మతో వెడతా – మాలరేవులోకి. ఆ గట్టుమీద కూచుని, కంట్లో పొడిచీ సూర్యుడు, పేపరు మిల్లు వెనకాల మునిగిపోయీ దాకా చూస్తూంటాను. అప్పుడు మళ్ళీ ఇసకా, నీళ్ళూ విడిపోతాయి. ఎదురెండ పోయాక.

మా యింటి దొడ్డిగుమ్మం తాలూకా ఆఫీసు పక్కసందులో కుంది. ఆఫీసు ప్రహరీ గోడ సరిగ్గా నా ఎత్తుంది. రోజూ దాని పక్కని నిలబడి కొలుస్తా. అమ్మ బిందె పుచ్చుకుని బయలుదేరగానే వెంటబడతా. ఆఫీసు ప్రహరీగోడ మా స్కూలు వేపు మళ్ళిన మూల, గోడకి మెట్లున్నాయి. ఎవరో ఇటుకలూడదీసి మెట్లు చేశారు. నేను గోడెక్కి జానెడు వెడల్పుటాపుమీద నడుస్తా. అమ్మ కింద సందులో, నేను గోడమీదా – ఇప్పుడమ్మకన్నా నేనే పొడుగు. ఎప్పుడేనా గవళ్ళ యెల్లి మేక గోడమీద నా కడ్డుతగులుతుంది. దాన్ని ఆ చివరదాకా తరుముతా. ఏటిగట్టువేపుని గోడకి ఎవరూ మెట్లు చెయ్యలా. అంచేత గేటు గుమ్మం దాకా నడిచివెళ్ళి అక్కడ దిగుతా – గుమ్మం అడ్డకమ్ములు పట్టుకుని.

మాలరేవు ఒడ్డోరకం. మొదటి మెట్టు దిగేసరికే మోకాలు లోతొస్తుంది – అమ్మకే – అమ్మ స్నానం చేసి నీళ్ళు పట్టుకుని కొండెక్కినట్టు ఒగుర్చుకుంటూ గట్టెక్కుతుంది. అంతవరకూ నేను గట్టుమీదే కూచుంటూ ఇసక తిన్నెలు చూస్తూ.

రేవుకి కొంచెం ఎగువుని జనం దిగి నడిచిపోతుంటారు – తిన్నెల మీదికి – తొడలు దాకా పంచెలు పైకి తీసుకుని.

ఒక్కసారే అమ్మ నన్ను మాలరేవులోకి దింపి స్నానం చేయించింది. తను చెయ్యి పట్టుకుంది; నాకు విదిలించుకు పోవాలనిపించింది. అయితే అమ్మ వొదల్లే – తెల్లారగట్ట చంద్రగ్రహణం అయిందట. రాహువు చంద్రుణ్ని సగందాకా మింగేసి మళ్ళీ వొదిలేశాడు. అందుకని బామ్మ మమ్మల్నందర్నీ స్నానం చేయమంది – విడుపు స్నానం.

"ఆ ఇసక తిన్నెల మీది కెడ్తానే అమ్మా" అన్నాను.

"వొద్దు – అమ్మో, తిన్నె మధ్యంతా అఖాతాలు" – అంది అమ్మ.

"మరి అన్నయ్యెడతాడే–"

"వాడు పెద్దాడు. నువ్వు మునిగిపోతావు. ఇక్కడెంత లోతో తెలుసా. రెండుగెళ్ళ కందదు. చూశావా – ఆ నడిచే జనాన్ని ? ఒక్కడుగు ఇవతలికి పడిందా, ఇంకంతే – మింగేస్తుంది – ప్రవాహం" – అని భయపెట్టిందమ్మ.

నాకు పాటిరేవంట నడిచి తిన్నెలమీది కెళ్లాలని ఎంతో ఉంటుంది. మునిగిపోతానేమోనని భయం. బన్నీ, సోమూ, అన్నయ్యా వాళ్ళంతా పోతుంటే ఆశగా చూస్తుంటాను. బన్నీ అయిదో ఫారం, అన్నయ్య క్లాసే. అయినా నా కన్నా పొడుగులేడు. అయినా వెడతాడు వాడు తిన్నెలమీదికి. వాళ్ళంతా లాగూలూ, చొక్కాలూ విప్పేసి చేత్తో పైకెత్తి పట్టుకుని పాటి రేవు దాటుతారు – తడిసిపోతే ఇంటిదగ్గర పెద్దాళ్ళు కొడతారని. సోముగాడు బట్టలన్నీ రేవులో రెల్లుదుబ్బుల్లో దాచేసి దిసమొలతోటే పోతాడు తిన్నెలమీదికి. వాడికి సిగ్గులేదు. దోసకాయలు కోసుకుని ఉప్పు కారం అద్దుకుని తిన్నంతసేపు అల్లాగే ఉంటాడు. తిరిగొచ్చాక మళ్ళీ బట్టలు తొడుక్కుంటాడు. తిన్నెలమీద ఆడాళ్ళు ఎదటపడితే సిగ్గెయ్యదూ వాడికి? తిన్నెలమీద ఆడాళ్ళుండరేమో.

సోమూగాడు పాటిరేవు నించి నీటివాలుకి ఈదుకొచ్చి మాలరేవులో గట్టెక్కుతాడు. వాడికి ఈతొచ్చు బాగా. వాడల్లా ఈత్తుంటే నా గుండెలు కొట్టుకుంటాయి – మధ్యలో మునిగిపోతే? రెండు గెళ్ళ లోతుందంది అమ్మ. పాటిరేవునించి నీరు జోరుగా లుంగలు తిరుగుతుంది. మాలరేవులోకి వొచ్చేటప్పుడు మెరకనించి నీరు లోతుకి పారేచోట ఆనమాలు తెలుస్తుంది. ఎవరో గీత గీసినట్టుటుంది. నీరు సరాసరి మాలరేవులో రాళ్ళమీదికి కొట్టి, అక్కణ్నించి గుండ్రంగా వెనక్కు తిరుగుతుంది – పెద్ద సుడిగుండంలాగ; సుడిగుండం మాత్రం లేదు. కాగితం పడవ వొదులుతారు వాళ్ళు – నది ప్రవాహంలో. అవి మాలరేవు గట్టుకొచ్చి ఢీకొని మునిగిపోతాయి. మునిగిపోకుండా మిగిలినవి గుండ్రంగా మళ్లీ ప్రవాహానికి ఎదురెళ్ళి, నట్టేట్లో తలకిందులై పోతాయి. ఏటి గట్టుమీద కెక్కి చూస్తే, ప్రవాహం గుండ్రంగా గుడికట్టినట్టుంటుంది. మాలరేవు ముందు మా బామ్మ కథలో బ్రహ్మరాక్షసి నోరులా ఉంటుంది ఆ గుండ్రం.

మా బామ్మ కథలో బ్రహ్మరాక్షసి నోరు తెరచుకుని ఓ పెద్ద గోతులో పడుకుని ఉంటాడు. చిన్నపిల్లలు యధాలాపంగా నడిచివొచ్చి ఆ రాక్షసి నోట్లో పడిపోతారు. ఆ రాక్షసి పిల్లల్ని మింగేస్తాడు.

రాత్రిళ్ళు కలల్లో నేనప్పుడప్పుడు ఆ రాక్షసి నోట్లో పడిపోతుంటాను. వాడి కడుపులోకి పోతుంటాను. ఒకోసారి తెల్లారి నిద్రలేచీదాకా కోసేస్తూనే ఉంటాను.

సుబ్బులత్త పెళ్ళికెళ్ళినప్పుడీ ఇసక తిన్నెలు లేవు. అప్పుడు వానలు. గోదారి నీళ్ళెర్రగా ఉన్నాయి. మాలరేవులో నిద్రగన్నేరు చెట్టుమొదట్లోకంటా వొచ్చేశాయి నీళ్ళు. అవతల పేపరు మిల్లూ, ఇవతల రైలు బ్రిడ్జీ అంతా ఒకటే నీరు.

సుబ్బులత్త పెళ్ళికి లాంచి మీదెళ్ళాం – పట్టిసం. లాంచినిండా పెళ్ళివాళ్ళమే. రాజమండ్రి నించి పున్నయ్య బాబాయి, రాములమ్మ పిన్ని, చిట్టిబాబు, సాంబడు, రాధాయి అంతా వొచ్చారు. పెళ్ళికి అప్పాయమ్మ అక్కర్లేదంది అమ్మ, నాన్న ఉండాలన్నాడు. బుద్ది చెల్లాయి నెత్తుకోడానికి ఎవరున్నారన్నాడు. అప్పాయమ్మంటే అమ్మ కిష్టంలేదు – నాన్న కిష్టం. ఎప్పుడేనా ఇద్దరూ దెబ్బలాడుకుంటారు కూడా – అంటే బామ్మకి వినబడకండా వాళ్ళ గదిలో. మా పడగ్గదిలోంచి వింటూంటాం అన్నయ్యా నేనూ. మాది బల్లచెక్కల మేడ. చెక్కల మధ్య సందుల్లోంచి కింద ఏం జరుగుతోందో చూడొచ్చు, వినొచ్చు.

అప్పాయమ్మంటే నాక్కోపం. బుడ్డి చెల్లాయి ఏడిస్తే గిల్లుతుంది - అమ్మ చూడకుండా. దాని పళ్ళు బాగుంటాయి - చిన్నగా బియ్యపు గింజల్లా, మోకాలుమీద కెగగడుతుంది చీర. దాని కాళ్ళమీద దమ్మిడీ కాసంతీసి స్ఫోటకంమచ్చలున్నాయి. మచ్చలున్నచోట నున్నగా సాగదీసి నట్టుంటుంది చర్మం మెరుస్తూ. మొగంమీద మచ్చలు చిన్నవి - బూరి బుగ్గమీద చుక్క పెట్టినట్టుంటాయి. - దాని వొళ్ళెక్కడ తాకినా మెత్తగా ఉంటుంది - పరుపులాగ. అది కిల కిల నవ్వుతుంది - ఎవరో కిచకిచలు పెట్టినట్టు. దాని చంకలో బుడ్డిని నాన్న చటుక్కున లాక్కుంటాడు ఎప్పుడన్నా. అప్పుడు కిచకిచ నవ్వుతుంది అప్పాయమ్మ. బుడ్డిని దానికిచ్చి మళ్ళీ తీసుకుంటాడు నాన్న, అప్పాయమ్మని నవ్వించడానికి. అమ్మ దాన్ని పని మానిపించేసింది - అంటే సుబ్బులత్త పెళ్ళినించి తిరిగొచ్చాక.

పట్టిసం ఎప్పుడో సాయంకాలం చేరాం. రాత్రి మేం నిద్రపోయాక సుబ్బులత్త పెళ్ళయిపోయింది. మర్నాడు భోజనాలొక్కటే గుర్తున్నాయి నాకు. పెళ్ళికొడుకుతో అన్నానికి కూచోనంది సుబ్బులత్త. బామ్మ బతిమాలినా గదిలోంచి ఇవతలికి రాలా - అప్పటిదాకా సుబ్బులత్తని నేను చూడలా - అదే చూడ్డం. బావుంటుంది సుబ్బులత్త - పచ్చటి తమల పాకులా - చెవి తమ్మమీద ఎండపడితే, వెలుతురు ఇవతలికంటా కనిపిస్తుంది - ఎందుకో ఏడుస్తోంది సుబ్బులత్త.

లాంచిలో ఎక్కాక నాన్నన్నాడు-

“ఇలాంటి వెధవ పెళ్ళిళ్ళు చెయ్యకపోతే యేం? దాని కిష్టంలేదని మొదట్నించీ మొత్తుకుంటూంది.”

“ఇదేం విడ్డూరంరా - నాలుగు రోజులు పాటుపడితే అదే ఇష్టపడుతుంది - అన్ని విధాలా అయిన సంబంధం - అరవయి ఎకరాల మాగాణి, తణుకు తాలూకా భూములు - ఏం చేదు మేసిందా -” అంది బామ్మ.

“అదికాదమ్మా. ఈ చచ్చుసంబంధం చెయ్యదల్చుకున్నప్పుడు, దానికి చదువెందుకు చెప్పించాలి పెదనాన్న” అన్నాడు నాన్న.

లాంచి నడిపేవాడూ, అప్పాయమ్మా ఒకరిమీదొకరు నీళ్ళు జిమ్ముకున్నారు. బుడ్డి చెల్లాయి కొంచముంటే గోదార్లో పడిపోను - నాన్న లాంచి వాణ్ణి లెంపకాయ కొట్టాడు. అందుకని అమ్మ అప్పాయమ్మని మానిపించేసింది - ఇంటికెళ్ళాక.

వాన జోరుగా కురుస్తున్నప్పుడు మాకు బడుండదు. బడంతా కురుస్తుంది - కొత్తగా పెంకు నేయించినా సరే. కోతులు పాడు చేసేస్తాయి. వానొస్తే శెలవొస్తుందని మేం తలోకానీ పోగుచేసి శనగపప్పు కొంటాం. కొండయ్య వాటిని బడికప్పుమీద జల్లేస్తాడు. కోతులు శనగపప్పు కోసం పెంకులన్నీ వొత్తిగించి పారేస్తాయి.

వాన పడుతుంటే చూడ్డాని కొస్తాడు బన్నీ. వాడన్నయ్య క్లాసు. అయినా అన్నయ్యకీ వాడికీ సరిపడదు - బన్నీ నాజూకుగా ఉంటాడు. వాళ్ల తాతా, బామ్మా వాణ్ణి ఆటల్లోకి రానియ్యరు - దెబ్బలు తగుల్తాయని. బన్నీకి అమ్మలేదు. వాళ్ళ నాన్న ఇంకో పెళ్ళి చేసుకుని స్టేషను పేటల్లో ఉంటున్నాడు. తాతా బామ్మా వాణ్ణి పెట్టుకుని పాత ఇంట్లో ఉంటున్నారు.

వానొస్తున్నా బస్సీ తడవకుండా రావొచ్చు మా ఇంట్లోకి. వాళ్ళ గాదిచూరు కిందనుంచి మా దూళ్ళశాలలోంచి మా పడమటింట్లోకి రావొచ్చు. వానొస్తే మా పడగ్గది పెద్ద కిటికీ తెరుస్తాం. పటమటింటి కప్పు కిటికీ కిందమట్టం నుంచి పైకిలేస్తుంది. అవతల పక్కకి వాలిపోతుంది మళ్ళీ. చూరు నీళ్ళు మా సావిట్లో పడకుండా కప్పుకీ మామేడ గోడకీ మధ్య పెద్దవొంచిన రేకు బిగించారు – ఓ చిన్న కాలవలాగ. వానొస్తుంటే ఆ కాలవ నిండుగా పారుతోంది. కాగితం పడవ లొదిలితే చాలు రై అని వెళ్ళిపోతాయి చివరిదాకా. మహజోరుగా పారుతుంది వాన నీరు. మా అరికాళ్ళు తెల్లగా అయిపోతాయి – చలికి.

అన్నయ్యా, సోమూ బన్నీ నస్తమానూ ఏడిపిస్తారు. ఆడపిల్లోయి అంటే వాడి కళ్ళల్లో నీళ్ళు తిరుగుతాయి. వాడు ఏడిస్తే సోమూ మరికాస్త ఏడిపిస్తాడు. అన్నయ్య మాత్రం ఏడిపించినా తరవాత ఊరుకో బెడతాడు. అన్నయ్య మహా అల్లరి చేస్తాడు. అందులో నాన్న లేకపోతే మరీ. మా బామ్మ నెత్తిమీద ముసుగు తీసేసి తబలా వాయిస్తాడు – ఆవిడ గుండుమీద. అమ్మ కొట్టడాని కొస్తే దొరకడు. అయినా బామ్మకి ముద్దే –వాడంటే.

“నీ మొగుడు పేరని ఆ వెధవనేమీ అనవు” – అంటాడు నాన్న.

“పోనీరా – కుర్రవెధవ” అంటుంది బామ్మ.

నన్ను చాలా ముద్దు చేస్తాడన్నయ్య. నన్ను సామ్సన్ అంటాడు. మా నాలుగో క్లాసు పిల్లల్లో కందర్లోకీ నేను బొద్దూ, పొడుగూ. ఓ మాటు సెకండ్ ఫారం వస్తాడు. కనకం నన్ను – ఒరే బొండం – అన్నాడు. వాణ్ని రోడ్డుమీద పడేసి మీదెక్కి కూచున్నా. మా మాస్టారొచ్చి విడదీసి నన్నే తిట్టారు పైగా. నాకు ఉక్రోషం వచ్చింది. తప్పు వాడిదైనా నన్నెందుకు తిట్టాలి? అన్నయ్య మట్టుకు నన్ను లేవదీసి చొక్కా దులిపి నా పుస్తకాలు పుచ్చుకొని చెయ్యి పట్టుకుని తాలూకాఫీసు గోడమీదకి తీసికెళ్ళాడు.

“తమ్మూ– మా బాగా తన్నావురా కనకంగాణ్ని” అన్నాడు.

నా కెంతో కడుపు నిండినట్టయింది. కనకంగాడి మీదా, మాస్టారుమీదా కోపం గూడా పోయింది.

స్టేషను పక్క మైదానంలో పెద్ద డేరా వేశారు. సర్కసు డేరా. అన్నయ్యా, నేనూ అందరం బడి ఎగ్గొట్టేసి జంతువుల్ని చూశాం – రోజల్లా. ఆ రోజునే నాన్న స్కూలుకెళ్ళాడు – మా జీతాలు కట్టడానికి. సాయంత్రం మా యిద్దర్నీ ఆఫీసు గదిలో తన బల్ల ఎదుట నిలబెట్టి అడిగాడు – ఎక్కడికెళ్లారని. ఏ అబద్ధం చెప్పాలో తెలియక నేననుమానిస్తుంటే మా అన్నయ్య చెప్పేశాడు. అన్నయ్య సాధారణంగా అబద్ధం చెప్పడు; చెప్పలేడనుకుంటా. నా మటుకు అబద్ధాలాడాలనుంటుంది – మంచి అబద్ధాలు.

“ఈవేళ బడి మానేసిందుకు మీకు శిక్షేమిటో తెలుసా. ఆ సర్కసు చూడ్డానికి మిమ్మల్ని పంపించను” అన్నాడు నాన్న.

మా నాన్న అన్నాడంటే ఇంక అంతే. అందుకని నాకేడుపొచ్చింది. మేం ఏడ్చినా నాన్న మెత్తబడడు. నాకు సర్కసు చూడాలని ఎంతో వుంది.అందులో ఆ తెల్లమచ్చలకోతి

మహాకొంటెది. అదేం చేస్తుందో చూడాలనుంది. ఆ రాత్రి అన్నం తినకుండానే వెళ్ళిపడుకున్నా. అన్నయ్య మాత్రం హుషారుగా పెరుగూ, ఒడియాలతో దంచేసి పైకొచ్చేడు. కిందంతా పడుకునే దాకా ఏదో చదివాడు - పద్యాలూ అవీ. ఇల్లు సద్దుమణిగాక దీపం ఆర్పేశాడు. పెద్దకిటికీ తెరిచి రేకు కాలవలోకి ఎక్కాడు.

"ఒరేయి ఎక్కడికిరా" అన్నాను.

"సర్కసుకి - నువ్వు నిద్రపో" అని పంచమ్మటే వెళ్ళిపోయాడు. చూరుచివర వెలగకొమ్మందుకొని మెల్లగా ఎక్కాడు. టపటప రెండు కాయలు రాలి చప్పుడు చేశాయి. చప్పుడు విని ఎవరూ లేవలేదుగదా అని కొంచంసేపు చూశాడు. తరవాత మెల్లగా దిగి వెళ్ళిపోయాడు. నాకు ఉడుకుమోత్తనం వొచ్చింది. తలగడాలో ముఖం దాచుకుని చప్పుడవకుండా ఎంతో సేపేడ్చాను. ఆ ఏడుపులో ఎప్పుడు నిద్రపట్టిందో, అన్నయ్యెప్పుడొచ్చి పడుకున్నాడో నాకు తెలీదు.

తెరిచిన పెద్ద కిటికీలో కూచుంటాను అప్పుడప్పుడు. మా గదిగోడ, పడమటింటి కప్పు మధ్యని డైమను ముక్కలా తెగింది ఆకాశం. కొంచెం పక్కగా ఉంది వెలగచెట్టు మొదలు. ఆ మొదలు వెనకాలనించి, పడమటింటి కప్పుమీదికి లేస్తాడు సూర్యుడు రోజూ. సూర్యుడి గుండ్రం అంతా కనబడే దాకా చూస్తూ కూచుంటాను. అన్నయ్యింకా లేవలేదు. పొద్దున్న బద్ధకంగా ఉన్నప్పుడు మేడమెట్లు జాగ్రత్తగా దిగాలి - నిచ్చెనలాగ మరీ ఏటవాలుగా ఉంటాయి కర్రమెట్లు.

మెట్లు దిగేసరికి నాన్న ఆఫీసుగది తెరిచుంది - ఎదురుగా.

సోఫాలో పడుకుని నిద్రపోతున్నాడు నాన్న. రాత్రి ఆలస్యంగా వొస్తే పడగ్గదిలోకి పోడు; సోఫాలోనే పడుకుంటాడు. లేచి ఆవులించాడు. నన్ను జూసి - తమ్మూ - అని పిలచాడు; వొళ్ళోకి తీసుకున్నాడు. అమ్మ గుమ్మంలో కొచ్చి నిలబడింది.

"అప్పాయమ్మ తల్లొచ్చింది రాత్రి" అంది అమ్మ.

"ఎందుకు?" అన్నాడు నాన్న - మరో వంక చూస్తూ.

"వాళ్ళమ్మాయి కోసం" అంది అమ్మ.

"ఇక్కడ పని మానేసిందిగా?" అన్నాడు నాన్న.

"మీరు కబురంపారని చెప్పి వొచ్చిందిట" అంది అమ్మ.

"నేనా? - దాంతో నాకేంపని?" అన్నాడు నాన్న. అటువంటప్పుడు నాన్నేదో దాస్తున్నాడని మాకు తెలిసిపోతుంది.

"ఏమో?" అని వెళ్ళిపోయిందమ్మ.

ఆ రోజుని అమ్మా, బామ్మా ధుమధుమలాడుతున్నారు. నాన్న భోజనం చెయ్యకుండా పదిగంటలకే కోర్టుకి వెళ్ళిపోయాడు. మాకు శనివారం శలవ. అన్నయ్యని అనవసరంగా కొట్టిందమ్మ - పెరుగూ అన్నంలోకి ఆవకాయబద్ద అడిగాడని.

"వాణ్ణెందుకు చెయ్యి చేసుకుంటావు? బావుంది ప్రయోజకత్వం" అంది బామ్మ.

ఆ రోజింక ఇంట్లో ఉండాలనిపించలేదు నాకు. బన్నీ ఇంటి కెళ్ళా.

"ఒరేయి తమ్మూ - మా బన్నీకి పెళ్ళిరా" అన్నారు వాళ్ళ తాతగారు.

బన్నీ సిగ్గుపడి గదిలోంచి ఇవతలికి రాలా. బన్నీకి పెళ్ళని నేనసలు నమ్మలా. నా అంతున్నాడు బన్నీ - పెళ్ళికొడుకంటే అన్నయ్యంతన్నా ఉండొద్దూ.

"పదిహేనూ వెడతాయిరా వాడికి! ఇంక మేమిద్దరం ఎన్నాళ్ళుంటామో ఏమో? కాస్త మా కాలూ చెయ్యీ ఆడుతుండగానే వాణ్నో ఇంటి వాణ్ణి చేసేద్దామని" అంది వాళ్ళ బామ్మ.

ఎంతసేపటికి బన్నీ ఇవతలికి రాకపోతే నేను ఇంటి కెళ్ళిపోతా.

సుబ్బులత్త బండి దిగిందప్పుడే.

"సుబ్బులత్తా!" అని పెద్దగా అరిచి బండి దగ్గిరికి పరిగెత్తా. నన్ను దగ్గరగా తీసుకుంది సుబ్బులత్త. అత్త భుజాలకంటే పొడుగే నేను.

"ఏవే ఒక్కత్తివే వొచ్చావా?" అంది బామమ్మ.

"నాన్న తణుకెళ్ళాడు, నేనిక్కడ దిగిపొయ్యా" అంది సుబ్బులత్త.

"నువ్వు మరి తణుకెళ్ళవా?" అంది బామ్మ.

"ఉహుఁ" అంది అత్త.

"రావమ్మ సుబ్బులూ - స్నానం చెయ్యి ముందు" అంది అమ్మ.

"అత్తా! గోదార్లో చేద్దామా స్నానం" అన్నాను నేను.

"పద" అంది అత్త.

పాటిరేవుకి తీసికెళ్ళా అత్తని. నదిప్రవాహంలో మొల లోతొచ్చింది అత్తకి. అదే మొదలు నేను పాటిరేవులోకి దిగడం. నీరు అద్దంలాగుంది. అడుగుని ఇసక కనిపిస్తోంది. అత్త నా మొల పట్టుకుటే కాస్త ఈతలు కొట్టా. కొంచం ఉక్కిరి బిక్కిరయినా భయపడలా. అత్తని గట్టిగా పట్టుకున్నా. అత్త కిలకిల నవ్వింది. అత్త నవ్వితే బావుంటుంది. మల్లి మొగ్గల్లాగుంటాయి పళ్ళు. వాటిలోపల మిరప్పండులాంటి నాలుక. అత్తనవ్వితే రెండు బుగ్గలూ సొట్టపడతాయి. ఆ సొట్ట తడమాలనుంటుంది నాకు. నీటివడికి మాలరేవుకి దగ్గిరగా వొచ్చేశాం నేనూ అత్తా.

"అటొద్దు- అగాతం" అన్నాన్నేను.

"ఆ!!" అంది ఆశ్చర్యంగా - అంటూ అగాతంలోకి వెళ్ళింది. నాకు అరవాలనిపించింది. చటుక్కుని మునిగింది. నేను బేరుమన్నాను. నాకు తెలీకుండానే. మళ్ళీ కిలకిల నవ్వుతూ నా కాళ్ళకిందొచ్చి నన్ను పైకెత్తేసింది.

'అయ్యో! మంచి మొగాడివే: ఇంత భయమైతే ఎల్లా" అంది.

"నీకు బాగా ఈతొచ్చా" అన్నాను.

"మా పట్టిసంలోనూ గోదావరుందిగా" - అంది

అంటూనే వెల్లగిలా నీళ్ళమీద తేలి పడుకుని మాలరేవు వేపెళ్ళింది.

నేను గట్టెక్కి తల తుడుచుకుంటూ చూస్తూ నిలబడ్డా. సుడి వెల్లినంత మేరా, గుండ్రంలా అల్లాగే తేలుతూ తిరిగింది. ఎంతోసేపటికి గట్టెక్కింది. అంతసేపు నీట్లో సోమూగాడన్నా తేలలేదు.

సుబ్బులత్త వొంటిని తడిపరికిణీ, పైట కండువా అంటుకుని నీరు కారుతుంటే ఎంతో బావుంది. తల మాత్రం తుడుచుకుని, తడిగుడ్డలతోటే నడిచొచ్చింది ఇంటిదాకా.

పరికిణీ బరువెక్కి కాళ్ళచుట్టూ తపతప కొట్టుకుంటూంటే దారంతా నీళ్ళుపడ్డాయి – ఎవరో జల్లినట్టు.

రాత్రి ఏడయిొసరికి పెత్తాతగారూ, సుబ్బులత్త మొగుడూ వొచ్చారు తణుకునించి. పెందలకడే మాకన్నాలు పెట్టేసి, మేడమీదికి పంపించేసిందమ్మ. ఆ తరవాతేదో పెద్ద గొడవయింది చాలా సేపు. అది పడమటింట్లో అయిన మూలాన్ని మాకు వినిపించలేదు.

"నాన్న అత్త పక్షం, బామ్మ పెత్తాత పక్షం" – అన్నాడు అన్నయ్య.

సుబ్బులత్తా మొగుడూ మధ్య ఏదో తగాదా ఒచ్చిందని అన్నాడన్నయ్య. ఎంతోసేపు గొంతుకలు చించుకుని కేక లేసుకున్నారు – పెత్తాతా, సుబ్బులత్తా.

మేం పడుకున్నా నిద్రపోలా. పదకొండు కొడుతుంటే చద్రునొచ్చి నా పక్కలో పడుకుంది సుబ్బులత్త. అప్పుడు నిద్రపట్టింది – నిద్రలో ఎన్నో కలలొచ్చాయి. అన్నిట్లోనూ అత్త మొగుడు కనబడ్డాడు: అత్తయ్య వెనకాల పరుగెత్తుతుంటే నోరు తెరుచుకున్న బ్రహ్మరాక్షసి అతన్ని మింగేసిందో కలలో. నాకు ముచ్చెమటలూ పోశాయి – కలలో బ్రహ్మరాక్షసి కనబడేసరికి. లేచి కూచున్నాను. అప్పటికప్పుడే అత్తావాళ్ళూ వెళ్ళిపోయారు. తెల్లారగట్ట రైలుకట – అమ్మ చెప్పింది, అత్త వెళ్ళిపోయిందని. నాకేడుపొచ్చింది నిజంగా.

బన్నీని, వాడి కొత్త పెళ్ళాన్నీ ఏనుగుమీద అంబారీ కట్టి ఊరేగించారు. వాడి తాతగారు వాణ్ని వొళ్ళో కూచోబెట్టుకుని కూచున్నారు అంబారీలో. బన్నీ అత్తారు కొల్చిన వారలు, పోలారం. పెళ్ళికి మరీ మరీ రమ్మన్నారు. అన్నయ్యకి జ్వరం – అందుకని వెళ్ళలా. సోమూగాడు వెళ్ళాడు.

"కొల్చినవారెంత కొల్చార్రా" అంటూ ఏడిపించడం మొదలెట్టాడు సోమూ. బన్నీ అసలే నలుగుర్ని చూడ్డానికి సిగ్గుపడుతున్నాడు. పెళ్ళయాక వారం రోజులు బడికేరాలా. సోమూగాడు ఏడిపిస్తే ఉక్రోషం వొచ్చి వాణ్ని పట్టుకు రక్కేశాడు.

అన్నయ్య జ్వరం తగ్గేదాకా నాకేం తోచలా. టైఫాయిడన్నాడు డాక్టరు. రెండురోజులు రాత్రీ పగలూ అన్నయ్య ఒకటే కలవరింతలు. బామ్మ వాడి మంచం పక్కనించి కదల్లా. వాడి పక్క నా గదిలో వేశారు. నాన్న గదిలోకి కూడా రానియ్యలా. ఒక్కణ్నే మేడమీద పడుకోలేనని మారాం చేశా. నానొచ్చి నా దగ్గిర పడుకునేవాడు. నాన్న దగ్గర పడుకుంటే బావుంటుంది – భయం ఏమీ ఉండదు.

అన్నయ్య లేకపోతే ఏం తోచదు. అందుకని ప్రతి సాయంత్రం పాటిరేవుకెళ్ళి నీళ్ళోసుకునేవాణ్ని. ఇంకా పాటిరేవులో లోతు తగ్గలా. మధ్యనైతే నేను మునిగిపోతాను. అందుకని అత్త నేర్పింది గుర్తుంచుకుని ఈదడం అలవాటు చేశా. సులు వింకా తెలీలా, రెండు మూడుసార్లు కాళ్ళూ చేతులు కొట్టుకునేసరికి ఒగుర్పొచ్చింది. రోజూ ఈత్తుంటే కొంచెం ఒగుర్పు తగ్గింది. అన్నయ్యకి పత్యం పెట్టే నాటికి పాటిరేవులో నా కందనిచోట ఈది అవతల మెరక దాకా వెళ్ళడం ఒచ్చింది – ఓ పదిహేను గజాల మేర.

పెద్ద పరీక్షలైపోయాయి. సోముగాడు రైలుగట్టుమీద ముంజెలు కొట్టిచ్చిందో రోజుని. అవి తింటుండగా పోర్టరు తరుముకొచ్చాడు. పాపం బన్నిగాడు దొరికిపోయాడు – పరిగెత్తలేక. వాళ్ళ తాతగారు పోర్టర్ని చెడతిట్టారు – వాణ్ని భయపెట్టినందుకు.

"రైలుగట్టుమీద తాడిచెట్లు నీ అబ్బగాడి సొమ్మా" అన్నారు.

"లేదు బాబయ్యా, ఉట్టినే భయపెట్టానండి" అన్నారు పోర్టరు.

"ఉట్టినే భయపెట్టాట్ట! కుర్రాడికి జ్వరమొస్తే" అన్నారు తాతగారు.

రాజాగారు వారాని కోసారి రైలు దిగేవారు. టాపులేని కారొచ్చేది ప్లాట్‌ఫారం మీదికి. ఒక ఆవుని తెచ్చి కట్టేవారు. రాజాగారు ఆవు పాలు దూడలా గుడుచుకునీవారు. ఎప్పుడన్నా తన్నుతుండెమోనని ఆత్రుతగా చూసేవాళ్ళం.

"అది జాతి ఆవుట - తన్నదు" అన్నాడు మూగాడు.

దానికి మన ఆవుల్లా మూపురం లేదు. పాలు తాగి రాజాగారు కారెక్కి గోదారిగట్టుకి పోయేవారు. మేం రైలుకట్టంట పరిగెత్తి బ్రిడ్జీమీదికి చేరి చూసేవాళ్ళం. బ్రిడ్జీక్రింద గుండ్రంగా తిరుగుతుండేదో లాంచి. దాంట్లోంచి మెట్లుండేవి నీళ్ళలోకి. రాజాగారు మెట్లమీంచి మెడలోతు దాకా దిగి స్నానం చేసేవారు. ఆయన కేదో జబ్బుట. ఇంగ్లీషు వైద్యులెవరూ కుదర్చలేకపోతే. ఒక మలయాళ వైద్యుడి పద్ధతి చెప్పాట్ట. ప్రతి బుధవారం వస్తారు రాజాగారు. మేం ఒక్కరోజు కూడా నాగా లేకుండా చూశాం రాజాగారి వైద్యం - శలవలు మూణ్ణెల్లూ.

రైలుబ్రిడ్జి కింద ఏటి గట్టుమీద నిలబడి పైకిచూస్తే, ఇనపదూలాలు చిత్రంగా కనబడతాయి. ఏటిగట్టు వాలులో తుమ్మచెట్లు దట్టంగా పెరిగి గుంయిమంటుంటాయి - అవతల రెల్లు దుబ్బులదాకా. వాటి మధ్యనించి ఉన్నాయి సన్నని రైలుపట్టాలు. గోదావరిలోంచి సిమెంటు కంపెనీదాకా ఇనపతొట్లలో ఇసక తెస్తారు, ఆ పట్టాలమీద. మేం వాటిమీద ఎక్కి వాలుకి రంయిమని పోతుంటాం. ఆ వాలులో పెడతారు రాజుగారి కారు. ఆయన సీటుపక్కని నా ఎత్తు తుపాకి ఉంటుంది నల్లగా మెరుస్తూ. సీట్ల మధ్య గుండ్రటి చిల్లులుంటాయి. ఎందుకో, అన్నయ్య ఎక్కి కూచున్నాడోసారి. రాజాగారు తరిమేశారు మమ్మల్ని. ఆ తరువాత కారుకో మనిషి కాపలా ఉండేవాడు. వాడికి పావలా ఇచ్చి తుపాకి ముట్టుకు చూశాడు సోమూ. బన్నీ దూరంగా గట్టుమీదే ఉండి చూస్తూండేవాడు - తరుముకొస్తే దొరక్కుండా పారిపోడానికి వీలుగా.

పుచ్చకాయలు కాప్పట్టాయని కబురు తెచ్చాడు కనకం. అన్నయ్యా వాళ్ళూ బయలు దేరుతూంటే, నేనూ వెనకాల పడ్డాను. అన్నయ్య వొద్దన్నాడు. నేను దాటగలనన్నాను. సోమూ, కనకం రానిమ్మన్నారు.

నాకు ఈతొచ్చు అన్నా. ఈది చూపించా. అబ్బో - అన్నాడు సోమూ వెటకారంగా. వాడికొక్కడికే ఈతొచ్చు ననుకుంటాడు అన్నాడు బన్నీ. అంటూ ఇసక తిన్నెదాకా ఇరవై పాతిక గజాలీదాడు. గట్టు చేరాక కొంచెం ఒగిర్చాడు. సోమూ మూతి వంకరగా పెట్టాడు- వెక్కిరింతగా. బన్నీ బట్టలు తడిసిపోయాయి - నావీని.

కాళ్ళదగ్గర మరీ ఎక్కువ వడి. అడుగుదీసి అడుగేస్తుంటే మెత్తని తాళ్ళేవో కాళ్ళకి లుంగలుచుట్టుకుని మాలరేవేపు లాగేస్తున్నట్టుంటోంది. నీళ్ళవేపు చూస్తూ నడుస్తుంటే ఎంత తిన్నగా నడుస్తున్నా ఇంకెక్కడికో పోతున్నట్టుంటుంది. కాళ్ళకింద ఇసక కరకర లాడుతున్నా మెత్తగా ఉంటుంది. శుభ్రంగా కొంచం దూరం ఈదాను గాని, ఎప్పుడూ

అంతదూరం నేను నడవలా, గోదావరి కడ్డంగా. అరమైలుందిట తిన్నెకి - అన్నయ్యన్నాడు. రైలుస్తంభాలు లెక్కపెడితే తెలుస్తుందిట. ఆ లెక్క ఎల్లా కట్టాలో అన్నయ్యకి తెలుసు.

తిన్నె ఎక్కిసరికి కాళ్ళు తేలిపోయాయి. నీళ్ళు కాళ్లని చుట్టుకుని లాగడంలేదుగా మరి. అన్నయ్య నన్ను లాగూ చొక్కా ఇసకమీద ఆరేసుకోమన్నాడు. బన్నీ తడిలాగే తొడుక్కున్నాడు - నీళ్ళలోంచి పైకిరాకుండానే. అంతమందిలో బట్టలు విప్పుకు తిరగడమంటే వాడికి సిగ్గు. అన్నయ్య తొడుక్కున్నాడు పొడిలాగు. వాడు బట్టలు విప్పేసి చేత్తో పట్టుకున్నాడు. సోమూగాడు మాత్రం దిసమొలతో దర్జాగా తిరిగాడు తిన్నె అంతా. వాడెప్పుడూ నిలబడే ఉచ్చ పోస్తాడు కూడా.

పాకచూరులో ఉన్నాయి ఉప్పూకారం పొట్లాలు. బన్నీ తెచ్చినవి తడిసిపోయాయి - వాడు ఈదడం మూలాన్ని. అంచేత జాగ్రత్తగా కొద్ది కొద్దిగా తినాలన్నాడు సోమూ. దోసకాయలు మంచి దోరగా ఉన్నాయి. ముద్దిదగ్గర కొరికి ఉప్పూకారం అద్దుకు తిన్నాం అందరం. ఉప్పూ కారం దోసకాయలో తడికి ఏకమయిపోయాయి. పెద్ద పుచ్చకాయ ఒకమూల బొక్కెట్టి చూశాడన్నయ్య - పండిందో లేదో అని. ఎర్రగా మాంసంలా ఉంది లోపల. దాని ముచిక కొయ్యడానికి మా దగ్గర కత్తిలేదు. అందుచేత పాదుని ఉండగానే తలోముక్కా చేత్తో పీకేసుకు తిన్నాం. సోమూగాడు తన వాటా కోస్తుంటే వాడి చేతిమీదికి పాకింది -పెద్ద పసిరిక పాము. మొదట అది పాదు తాలూకు తీగేమో అనుకున్నాం. అది పాకుతుంటే బేరుమన్నాడు సోమూ. చెయ్యి శక్తికొద్దీ విదిపేశాడు. పాము ఎగిరి ఎక్కడో గుబురుగా పెరిగిన పాదుల మధ్య పడింది. సోమూ పిచ్చిగా పరిగెత్తాడు నీటి అంచుకి. వాడి వెనకాల మేమూ పరిగెత్తాం. నీటి వొడ్డున చలిజ్వరం వొచ్చినట్టు వణికిపోతూ వెల్లగిల పడుకున్నాడు సోమూ. మాకు భయమేసింది. అన్నయ్య చెయ్యి చూశాడు- వైద్యుడు రాముళ్ళాగ. వాళ్ళంతా చూశారు.

"ఎక్కడా కరవలేదురా" అన్నాడు అన్నయ్య.

"లేదు" అని ఒప్పుకున్నాడు సోమూ ఒగురుస్తూనే.

"అది కరవక్కర్లా, ఊదితే చాలు అక్కడంతా కుళ్ళిపోతుందిట" అన్నాడు బన్నీ. వాడికి సోమూ అంటే పడదు.

"ఏడిశావు. ఊదేది పొడపాము" అన్నాడు సోమూ - కాస్త తేరుకుని.

"మరైతే ఎందుకల్లా ఒణికిపోయావు ఆడపిల్లలాగ?" అన్నాడు బన్నీ కసిగా. వాణ్నెప్పుడూ ఆడపిల్లంటాడుగా సోమూగాడు.

సోమూ వెటకారంగా చూశాడు వాడివంక - జవాబు చెప్పకండా.

చీకటి పడుతుంటే బయలుదేరాం - వెనక్కి. పాటిరేవు కెదురుగా నిద్ర గన్నేరు చెట్టుంది - గట్టుమీద. దానికి తిన్నగా నడవాలన్నాడు అన్నయ్య - సగందూరమొచ్చాక నిద్రగన్నేరు చెట్టు వెనక మబ్బుతో కలిసిపోయింది. తాలూకాఫీసు వెనకాలనుంచి లేచింది పెద్దమబ్బు. నల్లగా తారులాగ కోపంగా ఉరిమిందోసారి.

"నా వెనకాలే రండి" అన్నాడన్నయ్య.

"మొగాళ్ళైతే నా వెనకాల రండి" అన్నాడు సోమూ మాల రేవువేపు.

"వొద్దురా" అన్నాడన్నయ్య.

అప్పుడే సోమూ మెడలోతు నీళ్ళదాకా వెళ్ళిపోయాడు.

"ఒరేయి కొల్చినవారల్లుడా, ఏం చూసి ఇచ్చార్రా వాళ్ళు నీకు పిల్లని? మొగాడివైతే రారా నా వెనకని" అంటూ వెల్లగిలా తేలాడు సుబ్బులత్తలాగ. బన్నీ కాస్త తటపటాయించాడు. మాలరేవు పక్క రాతికట్టు చీకట్లో కాస్త దగ్గిరగా కనబడింది. బన్నీ తెగించి అటు నడిచాడు.

"పెద్దవాడే మొగాడనుకుంటున్నాడు – నాకూ వొచ్చు ఆ మాత్రం ఈత" అంటూ ముందు కెళ్ళాడు.

నాకూ వొచ్చింది పౌరుషం.

తమ్మూ – అంటూ నా వెనకాలే ఈడుకుంటూ వొచ్చాడు అన్నయ్య.

"అట్టే ఆయాసపడకు – మెల్లగా తేలుతూంటే, నీరే తీసుకుపోతుంది అవతల గట్టుకి" అన్నాడన్నయ్య.

చీకటి నీటినీ గట్టునీ కలిపేసింది. ఈదాను, ఈదాను – ఎంతకీ నీటి దూరం తరగలా. గట్టు నేనీదినకొద్దీ వెనక్కి పోతోంది. చేతులు పట్టేశాయి. ఊపి రాడ్డం లేదు. మునిగిపోతున్నా ననిపించింది.

"ములిగిపోతే ముక్కు మూసుకో" అన్నాడన్నయ్య వొగురుస్తూ. వాడి చెయ్యి నా నడుంకింది కొచ్చింది. ఎత్తింది. నాకు పౌరుషమొచ్చింది.

"నన్నొదిలెయ్యిరా" అన్నాను.

ఎక్కణ్ణించొచ్చిందో బలం – పిచ్చిగా బార వేశా. ఎటోకూడా నాకు తెలీదు – ఎన్ని గంట లేశానో బారలు! ఇంక మైకం కమ్మేస్తున్నట్టనిపించింది. మునిగిపోతున్నా – ఇంక చెయ్యి ఎత్తలేదు. ఊపిరి బిగపెట్టి మొగం నీట్లోకి వొంచా. చటుక్కుని పొట్టలో తగులుకుంది రాయి కొన. నెప్పెట్టినా లెక్క చెయ్యలా – గట్టుకి చేరా – నేనే ఇదంతా ఈదేశా.

అన్నయ్యా – అని అరిచా – గట్టుని వెల్లగిలా పడుకుని గర్వంగా నీరసంగా.

అన్నయొచ్చి నాపక్కని కూర్చున్నాడు వొగురుస్తూ. నా వొంటి మీద చెయ్యేశాడు. నిమిరాడు – ఎందుకో కాని బావుంది.

"బన్నీగా డేడిరా" అంటూ రాళ్ళమీద జారుతూ వొచ్చాడు సోమూ. వాడి గొంతులో కంగారు చూసి నాకు కళ్ళు తిరిగినట్టయింది.

"బన్నీ" అని గొంతెత్తి అరిచాడు అన్నయ్య.

"బన్నీ" అని అరిచాడు సోమూ.

నా కళ్ళు గిర్రుని తిరిగాయి. వెర్రిగా చీకటిని చీల్చి, నీళ్ళమీద వెతికాయి నా కళ్ళు.

"బన్నీ" అని అరుస్తున్నారు వాళ్ళిద్దరూ.

బన్నీ, బన్నీ – అంటూ ఏవో గొంతుకలు నా బుర్రలో గింగురుమన్నాయి. రాళ్ళమీద పరిగెత్తా – లేస్తూ, పడిపోతూ; ఎక్కడెక్కడో కొట్టుకుపోయింది వొళ్ళు; అప్పుడప్పుడు నీళ్ళలోకి జారి మళ్ళీ గట్టెక్కా. రేవంతా రాళ్ళు పరిచినంతమేరా పరిగెత్తా – వెనక్కి

ముందుకీ – బన్నీ అని పిచ్చిగా అరుస్తూ. రాతిమీద దిశమొలతో ఒగురుస్తూ కూచున్నాడు సోమూ – ఇంక అరవలేక. వాణ్ణి చూడ్డంతోటే ఇంక కోపం ఆగలే. మీద కురికా.

"నువ్వే చంపేశావు వాణ్ని. బన్నీగాణ్ని నువ్వే చంపేశావు" అని వెర్రిగా అరుస్తూ. వాడూ నేనూ నీట్లోకి దొర్లుతుంటే అన్నయ్యొచ్చి గట్టిగా పట్టుకున్నాడు నన్ను.

"తమ్మూ – తమ్మూ– బన్నీ ఒస్తాడు. ఎక్కడో గట్టుకి చేరుకునుంటాడు. కంగారు పడకు తమ్మూ" అంటూనే వాటేసుకున్నా డన్నయ్య.

నడుంలోతు నీళ్ళలో మొదటి మెట్టుమీదలాగే చతికిలబడి సోమూ వెక్కి వెక్కి ఏడ్చాడు.

"బన్నీగాడింక లేదురా – గోదారి పొట్టనెట్టుకుంది – నామూలాన్నే" అంటూ ఎగుపుల మధ్య అన్నాడు.

"తమ్మూ – ఇంటికి పోదాం రా. నిన్నింటి దగ్గరొదిలేసి ఎవరినన్నా తీసుకు రావాలి. రా తమ్మూ" అన్నాడన్నయ్య.

"బన్నీ దొరికేదాక నేనింటికి రాను" అన్నాను. ఏడుపూ కోపంతో ఊగిపోతూ అన్నయ్యని విదిలించేశాను.

ఆఖరికి అన్నయ్య పరిగెత్తాడు, ఎవరినన్నా తీసుకురావడానికి.

నేను గట్టుని ముఖం మట్టిమీద పెట్టి పడుకున్నా. సోమూగాడు జ్వరం ఒచ్చినట్టు ఒణికిపోతున్నాడు.

"తమ్మూ – నేను చంపలేదురా వాణ్ని – వుత్తినే వేళాకోళానికి ఈదమన్నాన్రా తమ్మూ? – నేను వాణ్ని చంపలేదురా" అంటూ పెద్దగా అరుస్తూ కూచున్నాడు. నాకు ఏడుపుల మధ్య ఇంక గొంతు పెగల్లే – గొంతు విడినా నాకప్పుడు మాటలేం రావు – నోటంట. అసలప్పుడు నేను మాటలన్నీ మరిచిపోయా. పెద్ద కుదుపులా వొచ్చింది– కాళ్ళనించి తలదాకా. అప్పుడు తెలిసింది వొణుకుతున్నది నేనని – సోమూగాడు కాదని.

ఎంతో రాత్రయింది. అమ్మా నాన్నా వొచ్చి నా పక్కని కూర్చున్నారు. బామ్మ బన్నీ బామ్మగారిని పట్టుక్కూచుంది పై మెట్టుమీద. బన్నీ తాతగారు గుండెలూ, పొత్తికడుపూ చేత్తో రాసుకుంటూ – "నాయనా నా తండ్రీ!" అంటున్నారు – పూడిపోయిన గొంతులో.

అమ్మా నాన్నా ఏమన్నారో నాకు గుర్తులేదు.

నేను రాను – ఇంటికి రాను – అని మాత్రం నేనంటున్నా.

దీపాలు నీళ్ళలో మెరుస్తున్నాయి. టార్చి లైట్లూ, అరికిన్ లాంతర్లూ, నాలుగు తెప్పలూ మాల రేవు కెదురుగా ఇటూ, అటూ తిరుగుతున్నాయి.

"నేను రాను, ఇంటికి రాను" అంటూనే ఉన్నా – నాన్న నన్ను భుజం మీదేసుకున్నాడు.

"నేను రాను" అంటూనే ఉన్నా. కాని గింజుకోలేదు. నా బరువుకి నాన్న తూలాడు. నేను ఎప్పుడు నిద్రపోయానో.

బామ్మ కథలో బ్రహ్మరాక్షసికి ఎన్నో నోళ్ళున్నాయి. ఇసక తిన్నెల మధ్య లోతులు వాడి నోళ్ళు. అవి బన్నీలాంటి పిన్నలకోసం అవురావురుమని చూస్తుంటాయి. పాటిరేవు

దాటి అడుగు తప్పితే ఏదో నోటితో మింగేస్తాడు బ్రహ్మరాక్షసి. గుండ్రంగా ఉంటాయి ఆ నోళ్ళు - మాల రేవు దగ్గిర సుడిలాగా.

నాన్న రొమ్ముమీద వెంట్రుకలు మొగానికి కిచకిచలు పెట్టాయి. నాన్న కూడ నిద్రలో మెదిలాడు - వేళ్ళు విప్పి చూశా. నాన్న గదిలో పడుకున్నా - నాన్న రొమ్ము మీద - నాన్న వొళ్లు చిత్రంగా వాసనేస్తోంది. ఓమాదిరి చెమట వాసన.

తమ్మూ - అన్నాడు నాన్న.

బన్నీ - అన్నాను లేవకుండానే.

దొరకలా - వెతుకుతున్నా రింకా - అన్నాడు నాన్న.

కాని నాన్న రొమ్ముమీద పడుకుంటే ఇంకేం భయంలేదు. నాన్న అంత దగ్గిరగా ఉంటే ఇంక కంగారుండదు. బుగ్గకి నాన్న రొమ్ము తగుల్తుంటే, లోపలంతా చల్లగా హాయిగా ఉంది.

మేడమీద కిటికీలోంచి మాలరేవు, బ్రిడ్జీ, పేపరుమిల్లూ, ఇసక తిన్నెలూ స్పష్టంగా కనిపిస్తాయి. రాత్రి పడిన జడికి గాలి కడిగేసినట్టయి పోయింది. ఎన్నో ఇసక తిన్నెలు - వాటి మధ్య లోతులు తెలీని అఘాతాలు, మళ్ళీ వరదలొచ్చేదాకా అల్లాగే ఉంటాయి ఇసక తిన్నెలూ, దోసకాయలూ, పుచ్చకాయలూ చూపించి రమ్మని పిలుస్తాయి; వెళ్ళాలనుంటుంది; మనస్సులాగేస్తుందట. బ్రహ్మరాక్షసి నోళ్ళలాగ మధ్య లోతులు తెరచుకుని సిద్ధంగా ఉంటాయి.

అయినా వెడుతుంటాం ఇసక తిన్నెల మీదికి.

లోతుల్నీ, సుడిగుండాన్నీ దాటిపోతుంటాం ఇసక తిన్నెల మీదికి.

**(యువ: దీపావళి 1965)**